
# అతడు




ఎల్.ఆర్.స్వామి

ఆ వార్త వినగానే, చాలా బాధ కలిగింది. అతన్ని వెంటనే చూడాలని అనిపించింది.

అతనితో నాకు కేవలం రెండు సంవత్సరాల పరిచయమే - అప్పుడప్పుడు, బస్సులోనూ, రోడ్డు మీదనూ, కలసిన పరిచయం - అయినా మంచి మిత్రుడయ్యాడు. స్నేహ బంధాల లోతుకు, కొలమానం సంవత్సరాలు కావు కదా !

మనస్సులో ఆవేదన సుడిగాలిలా వీస్తోంది. వెంటనే బయలుదేరాను.

అక్కడికి వెళ్ళాక ఏం చెయ్యాలని ఆలోచించాను. అక్కడి దృశ్యం చూసి తట్టుకోగలనా ? సంతాపం తెలియపరచట మెలా ?

ఎల్లప్పుడూ, విషాదాత్మకంగానే కనబడ తానట నేను! అస్సలు నా పెదవులు పెగలవు!

ఏం చెయ్యాలనే ఆలోచనలో పడ్డాను నేను.

బస్సులో నేనుంటే నా పక్కనే కుర్చునే వాడు అతడు నాతో మాట్లాడటానికి ప్రయత్నం చేసేవాడు.

నేను 'సీరియస్'గా వుంటాను. బాగా పరిచయమున్నవారితోనైనా పొడిగా మాట్లాడే అలవాటు నాది.

మొదట్లో అతని ధోరణి నాకు నచ్చేది కాదు. ఏవేవో మాటలు చెప్తూ 'జోకు'లు వేసేవాడు. అతడు చెప్పే జోకులకు, బస్సులో జనం విరగబడి నవ్వేవారు – నేను తప్ప.

"పెద్దాయన పెదవులకు 'ఫెవికాల్' పులుముకున్నట్లున్నారు" ఒకరోజు నా పక్కనే కూర్చొని అన్నాడు. "ఫెవికాల్" పులుముకుంటే పెదవులు నల్లపడుతాయి కదా – పెద్దాయన పెదవులు చూడండి."

నేను నవ్వటం లేదని ఆట పట్టిస్తు న్నాడని అర్థమైంది. నిత్యాగ్ని హోత్రంలా సదా సిగరెట్టుండే నా పెదవులు నల్లగా కాకపోతే ఎర్రగా వుంటాయా !

గట్టిగా పళ్ళు కొరుక్కున్నాను. అతని చెంప మీద ఒకటి అంటించాలని తోచింది. కాని బస్సులో వున్నాం కదా ! చేసేదేమి లేక చత్వారం కళ్ళద్దాలు ఒకసారి తీసి అద్దాలు 'కర్చీఫ్'తో వొత్తి మళ్ళీ పెట్టుకున్నాను.

మెలమెల్లగా నాకు దగ్గరయ్యాడు అతడు. ముప్పది సంవత్సరాల కన్నా ఎక్కువ వుండదు అతనికి.

అతని మాటలలో కనబడిన జీవిత వాస్తవికత నన్ను ఆకట్టుకుంది. అతని జోకులు, సరదా మాటల వెనుక ఒక జీవిత సిద్ధాంతం దాగి వున్నట్టు అనిపించింది నాకు. ఒక నాలుగు రోజులు అతడు కనపడకపోతే హృదయం బాధతో మూల్గేది.

ఇప్పుడు......

"మనం ఎల్లప్పుడూ, కాలానికన్నా ముందుండాలి." ఒకరోజు అతడు అన్నాడు" ఎంతో ముందు చూపుంటే తప్ప ఈ రోజులలో బాధ లేకుండా బతకలేం. అందుకే ఒక పిల్లాడు వున్నాడుగా చాలని, ఆవిడకి ఆపరేషన్ చేయిం చాను. ఒక బిడ్డని పెంచి చదివించి ప్రయో జకుడ్ని చేయటమంటే మాటలా !"

నాకు సిగ్గనిపించింది. నలుగురు పిల్లల తండ్రిని నేను. నలుగురి చదువు సం ధ్యలు ఆలనా పాలనా చూడ లేక సతమతమై పోతున్నాను. చిన్నవాడైనా, తెలివిగా ప్రవర్తించిన అతన్ని మనసులో అభినందించాను.

"హలో సార్!" మరో రోజు రోడ్డుమీద కనబడినప్పుడు పలకరించాడు అతడు". ఎలా వున్నారండి?"

నగరంలో అతి ప్రసిద్ధమైన స్కూలు గేటువద్ద నిలబడి వున్నాడు అతడు – పక్కనే అతని భార్య – ఆమె భుజం మీద ఒక చంటి పిల్లవాడు – పసిడి ముద్ద – "ఏమిటీ, ఇక్కడ ?" నేను అడిగాను. "ఈ ఎండలో..." "పిల్లవాడి స్కూలు గురించి...." స్కూల్ చూపిస్తూ అన్నాడు, అతడు.

నాకు మాటలు రాలేదు. పిల్లవాడు నేలపైన పాదాలు మోపనే లేదు, అప్పుడే....

"ఇక్కడ డొనేషన్ ఇప్పుడే చాలా ఎక్కువకదండి. అంతే కాక ప్రతి సంవత్సరం డొనేషన్ పెంచుతున్నారు కూడా.. అందుకే...."

"అందుకే..."

"ఇప్పుడే డొనేషన్ కట్టి సీటు ఖాయం చేసుకోవటానికి వచ్చాం." గొంతు తగ్గించి మళ్ళీ అన్నాడు అతడు." మాఆవిడ మేనమామ ఇక్కడే మేనజర్‌గా పనిచేస్తున్నారండి. ఈ ఏడాది "రిటైర్" అయిపోతాడు. రిటైర్ అయ్యేలోగా సీటు బుక్ చేసి డొనేషన్ కట్టేస్తే కొంత లాభముంటుం దని...."

నా బుర్ర తిరిగిపోయింది. అతని ముందు చూపుని మెచ్చుకోకుండ వుండలేక పోయాను.

అతనంటే నాకు అభిమానం పెరి గింది. నా సమస్యలు అతనితో చర్చించటం మొదలుపెట్టాను. జీవితం సాఫీగా ప్రవహించా లంటే కావలసినది ముందు చూపని, క్రమ శిక్షణతో ప్రణాళికా బద్ధంగా పని చెయ్యాట మేనని అతడు నొక్కి వక్కాణించేవాడు. జీవితాన్ని గాలి పటంలా ఎగిరేసిన నేను, ఆ మాటలు విని ముడుచుకుపోయేవాడిని.

"మనలాంటి నగటు జీతగాళ్ళు ముందు చెయ్యవలసిన పొదుపు గురించి నిర్ణ యించు కోవాలండి."అతడు ఒకరోజు అన్నాడు. "భవిష్యత్ అవసరాలకు పొదుపు చేశాక మిగిలినదే ఖర్చు చెయ్యాలండి."

నేను ఏమీ అనలేదు. పొదుపుఅనేపదం నా జీవిత నిఘంటువులో లేదు. గత ముప్పది సంవత్సరాలుగా నేనూ మా ఆవిడ పొదుపు చెయ్యటం గురించే పోరాడుకుంటున్నాం. ఉన్న ప్పుడు, అనుభవించాలని, రేపటి గురించి ఆలో చించవలసిన అవసరం లేదని నేను అనేవాడిని.

అప్పు కోసం జీవిత భీమా సంస్థకి వెళ్ళినప్పుడు అక్కడ కనబడ్డాడు, అతడు. "రోజు రోజుకీ కాలేజీ ఫీజు పెరుగుతోంది, కదండి." అతడు అన్నాడు. "పిల్లవాడు చదువు గురించి 'పాలసి' తీసుకున్నానండి. ఇప్పుడు కొంత డబ్బు కడితే, వాడు పెద్దవాడైనాక చదువుకు అందు తుంది."

నేను మాట్లాడలేక పోయాను. అత నలా నాకు ముందుచూపు లేనందువల్ల మామూలు చదువు చదివి ఉద్యోగం కోసం తిరిగే మా అబ్బాయి నా మనస్సులో కదిలాడు.

చాలా జనమున్నారు అతని ఇంటి వద్ద. అందరితోను కలిసి మెలిసి తిరుగుతాడు కదా అతడు !

కొందరు అక్కడక్కడ గుమికూడి మాట్లాడుకుంటున్నారు.

నిన్న రాత్రి కూడా బాగానే వున్నాడట! పొద్దునే మామూలుగానే లేచాడట ! మూడు నాలుగు విరోచనాలు అయ్యాయి; అంతే. డాక్టర్ రాకముందే....

వరదగోదారి అలా ప్రవహించిన కన్నీరు వల్ల నాకు దారి కనబడలేదు. అయినా...

ముందుకు కదిలాను. దారిలో వున్న వారిని పక్కకు నెట్టి గబగబ నడిచాను. తొంగి చూసాను హాలులో నేలమీద అచేతనంగా పడివున్న అతన్ని, అతని పక్కనే ఏడుస్తూ కూర్చొని వున్న అతని భార్యని, ఆమె ఒడిలో వున్న అతని రెండేళ్ళ పసివాడి కళేబరాన్ని.